• **సోమశిల:** రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు అండర్–14, 17 విభాగాల్లో రేవూరు పాఠశాల విద్యార్థినులు కే రేష్మ, పీ భవ్య, ఆర్ సాయిలక్ష్మి ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఉపాధ్యాయులు శనివారం అభినందించారు.









నూతన సంవత్సర కోలాహలం


సంగం: బేకరీ వద్ద కొనుగోలుదారుల సందడి


ఆత్మకూరు: ఎల్ఆర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న చిన్నారులు


అల్లూరులో వైఎస్సార్‌సీపీ యువత సంబరాలు

ఆత్మకూరు/ ఉదయగిరి/ సంగం/అల్లూరు: నూతన సంవత్సరం సందర్భంగా శనివారం కోలాహల వాతావరణం నెలకొంది. ఆత్మకూరు, ఉదయగిరి, కావలి నియోజకవర్గాల్లోని బేకరీలు, పండ్లు, వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో సందడిగా మారాయి. ప్రధాన కూడళ్లలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ యువత ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఆత్మకూరులోని ఎల్ఆర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎస్‌కే షకీలా చిన్నారులతో కేక్ కట్ చేయించి మిఠాయిలు పంచిపెట్టారు. ఏపీ బాలుర గురుకుల పాఠశాలలో కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముందస్తుగా నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాగా అర్ధరాత్రి నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ యువత సందడి చేశారు. కేక్‌లు కట్ చేసి ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. అల్లూరులోని కోనేటి సత్రంలో అల్లూరు–1 సచివాలయ కన్వీనర్ షేక్ జంషీర్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి బాణాసంచా పేల్చారు. వైఎస్సార్‌సీపీ నేత కరేటి దైవాదీనం, సామంతుల సురేష్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు బత్తల సుధ, షేక్ బాబు, షేక్ రసూల్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే మేకపాటి పర్యటన

దుత్తలూరు: మండల కేంద్రమైన దుత్తలూరులో ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి ఆదివారం పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వాసిపల్లి వెంకటేశ్వరరెడ్డి శనివారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నూతన పింఛన్లను లబ్ధిదారులకు పంపంపిణీ చేస్తారని చెప్పారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు సెబ్ స్టేషన్ ప్రారంభం

కలిగిరి: స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం ఎదురుగా సెబ్ స్టేషన్‌ను ఆదివారం ప్రారంభించనున్నట్లు ఇన్‌చార్జి స్టేషన్ హౌస్‌ఆఫీసర్ ఎస్ ప్రభాకర్‌రావు శనివారం తెలిపారు. వింజమూరులోని సెబ్ స్టేషన్‌ను కలిగిరి హెడ్‌క్వార్టర్స్‌కు మారుస్తున్నట్లు చెప్పారు. కలిగిరి, కొండాపురం, వింజమూరు, వరికుంటపాడు మండలాలు కలిగిరి సెబ్ స్టేషన్ పరిధిలోకి వస్తాయని వివరించారు. ఇసుక అక్రమ రవాణా, అక్రమ మద్యం, గంజాయి విక్ర యాలు, పేకాట, కోడిపందేలు వంటి జూదా లు నిర్వహిస్తుంటే 94409 02523, 14500 (టోల్‌ఫ్రీ)నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

నూతన సంవత్సరం వెలుగులు నింపాలి



ఆత్మకూరు: నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆత్మకూరు నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే మేకపాటి గౌతమ్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, ప్రతి ఒక్కరూ సంతోషంగా జీవించేలా, సరికొత్త విజయాలను సాధించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, అధికారులకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

• **మర్రిపాడు:** డీసీపల్లిలో నూతనంగా నిర్మించిన పంచముఖ శక్తి గణపతి ఆలయాన్ని మండల ప్రత్యేకాధికారి నటరాజన్ శనివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు పొశర్లపూడి వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.









































హెచ్‌ఎంకు సన్మానం



మర్రిపాడు: చుంచులూరు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేసిన హెచ్‌ఎం కారంశెట్టి పద్మాకర్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు శనివారం ఘనంగా సన్మానించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా పద్మాకర్ సేవలను కొనియాడారు. తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ విష్ణుకుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు రాజేంద్ర కుమార్, మురళీకృష్ణ, అశోక్, రేవతి, రబ్బాని, తదితరులు పాల్గొన్నారు.



రేపు గంధ మహోత్సవం

చేజర్ల: స్థానిక హజరత్ ఖాదర్‌వలి దర్గాలో గంధ మహోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు షేక్ సిరాజుద్దీన్, హాజీ ఖాదర్‌బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మధ్యాహ్నం అన్నదానం, రాత్రికి గంధం ఊరేగింపు నిర్వహించనున్నట్లు వివరించారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి చేతులు మీదుగా శనివారం పంపిణీ చేశారు. హెచ్‌ఎం శేషాద్రివాసు, ఉపాధ్యాయులు కే మధుసూదన్ శాస్త్రి, విద్యాకమిటీ చైర్మన్ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



కొండాపురం: తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్యామ్‌సన్ డిప్యూటీ తహసీల్దార్‌గా పదోన్నతి పొందడంతో శనివారం సత్కరించారు. తహసీల్దార్ ఎం బ్రహ్మయ్య మాట్లాడుతూ సీనియర్ అసిస్టెంట్ శ్యామ్‌సన్ రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా పదోన్నతి పొంది ఇక్కడే బాధ్యతలు స్వీకరించడం అభినందనీయమన్నారు. డీటీ కోటేశ్వరరావు, ఆర్‌ఐ రవికుమార్, వీఆర్వోలు, సర్వేయర్లు,తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా సాగుతున్న క్రికెట్ పోటీలు



హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు

కావలి: పట్టణంలోని తుమ్మలపెంట రోడ్డు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న క్రికెట్ టోర్నమెంట్ ఉత్కంఠభరితంగా సాగుతోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా డిసెంబర్ 21న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రారంభించిన ఈ టోర్నమెంట్‌లో 80 జట్లు పాల్గొన్నాయి. ప్రతిరోజూ మూడు మ్యాచ్‌లు చొప్పున 78 మ్యాచ్‌లు జరగాల్సి ఉండగా, ఇప్పటి వరకు 26 మ్యాచ్‌లు ముగిశాయి. తొలి రౌండ్ మ్యాచ్‌లు జనవరి 6 వరకు కొనసాగనున్నాయి. 7వ తేదీ నుంచి రెండో రౌండ్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. 11వ తేదీ క్వార్టర్ ఫైనల్స్ జరుగనున్నాయి. కాగా క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి సహకారంతో నిర్వహిస్తున్న టోర్నమెంట్ నిర్వాహకులు గా ఈతముక్కల చంద్రశేఖర్‌రెడ్డి , మన్నెమాల దేవధీరజ్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. ఓవర్‌లో మూడు సిక్స్‌లు కొట్టిన బ్యాట్స్‌మెన్‌కు రూ.1,000 నగదు అందిస్తున్నారు. ప్రతి మ్యాచ్‌లో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' సాధించిన క్రీడాకారుడికి మెమెంటోలు అందజేసి సత్కరిస్తున్నారు. టోర్నమెంట్ విజేతకు రూ లక్ష, రన్నర్‌కు రూ.50వేలు. తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.35వేలు నగదు, షీల్డులు అందజేయ నున్నారు. 'మ్యాన్ ఆఫ్ ది సీరీస్'గా రూ.10వేలు నగదు ఇవ్వనున్నారు.

ట్యాబ్‌ల పంపిణీ



ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి చేతులు మీదుగా శనివారం పంపిణీ చేశారు. హెచ్‌ఎం శేషాద్రివాసు, ఉపాధ్యాయులు మధుసూదన్ శాస్త్రి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంసలు



ఉదయగిరి: విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన ఉదయగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వీ గిరిబాబుకు ప్రశంసాపత్రం లభించింది. ఇటీవల ఉదయగిరి సర్కిల్ పరిధిలో చోటుచేసుకున్న చోరీలు, హత్య కేసులను త్వరితగతిన ఛేదించడంతో నెల్లూరులో శనివారం జరిగిన నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ విజయారావు ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు.

గ్రామసభలు



కావలి రూరల్ : తుమ్మలపెంట, అన్నగారిపాళెం పంచాయతీల్లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఆక్వాజన్ రీసర్వేపై శనివారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ సహాయ సంచాలకుడు ఎస్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఆక్వా భూములను రీసర్వే చేసి సర్వే నంబర్లను గ్రామ పంచాయతీ కార్యాలయంలో పొందుపరిచినట్లు తెలిపారు. ఆక్వాజోన్‌లో ఆక్వా సాగుచేసే రైతులకు మాత్రమే ప్రభుత్వం సబ్సిడీ విద్యుత్‌ను అందజేస్తుందని వివరించారు. మత్స్యశాఖ అభివృద్ధి అధికారి వీ లక్ష్మీనారాయణ, వీఆర్వోలు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, ఫిషరీస్ సిబ్బంది, గ్రామ సర్వేయర్లు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

దక్షిణ కాలువకు సాగునీరు విడుదల

చేజర్ల: సోమశిల దక్షిణ కాలువకు శనివారం ఉదయం నీటిని విడుదల చేసినట్లు సోమశిల ప్రాజెక్ట్ ఏఈ వినయ్‌కుమార్ తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు చేజర్ల పెద్ద చెరువు ఎగువ ప్రాంతంలో దక్షిణ కాలువకు గండి పడడంతో సాగునీటి సరఫరాను నిలిపివేశారు. శుక్రవారం రాత్రికి గండి మరమ్మతులు పూర్తవడంతో సాగునీటిని విడుదల చేశారు.

రేపు ఎమ్మెల్యే గౌతమ్‌రెడ్డి పర్యటన

చేజర్ల: మండలంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సోమవారం పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఉదయం 10 గంటలకు చేజర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ఆప్కాబ్ నిధులతో నిర్మించిన గోదాములను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నూతన పింఛన్లను పంపిణీ చేస్తారని వివరించారు.

వాహనాల వేలం

ఆత్మకూరు: పట్టణంలోని సెబ్ కార్యాలయంలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలాన్ని శనివారం నిర్వహించారు. కారు, నాలుగు మోటార్ సైకిళ్లను వేలం వేయగా, ప్రభుత్వానికి రూ.1,51,935 ఆదాయం వచ్చినట్లు సెబ్ అధికారులు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ధర కన్నా ఎక్కువ ధరకు వాహనాలను పాడుకున్నారని వివరించారు. సెబ్ ఏఈఎస్ కృష్ణకిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేలంలో సీఐ బీ నయనతార, ఉదయగిరి ఇన్‌స్పెక్టర్ రవీంద్రబాబు పాల్గొన్నారు.